ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, మార్చి 09, 2015,

ఇరవై మూడవ సమావేశము, సంపుటము-1, నంబరు-1.

**MONDAY, THE 9th DAY OF MARCH, 2015,**

**TWENTY THIRD SESSION, VOLUME - 1, NO.1,**

*****

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు
**సోమవారం, మార్చి, 2015.**

## అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యులు శ్రీ పాలడుగు వెంకటరావు మృతిపట్ల సంతాప ప్రతిపాదన.

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**
**MONDAY, THE 9TH DAY OF MARCH, 2015**
(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

***

(జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమైంది.)

ఛైర్మన్‌ః కీ.శే. శ్రీ పాలడుగు వెంకట రావు గారికి సంతాప తీర్మానం మీద సభానాయకుడు శ్రీ యనమల రామకృష్ణుడు ప్రతిపాదిస్తారు.

**CONDOLENCE MOTION**

SRI YANAMALA RAMAKRISHNUDU: Chairman Sir, with your permission, I beg to move the Motion:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Paladugu Venkata Rao, Member of Andhra Pradesh Legislative Council and conveys its deep sense of sympathy to the Members of bereaved family."

MR.CHAIRMAN: Motion moved. The question is:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Paladugu Venkata Rao, Member of Andhra Pradesh Legislative Council and conveys its deep sense of sympathy to the Members of bereaved family."

The House unanimously adopted the Motion.

శ్రీ యనమల రామకృష్ణుడు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, శ్రీ పాలడుగు వెంకట రావుగారు చాలా సీనియర్ రాజకీయ నాయకుడు. వారు మా అందరి కంటే ముందు రాజకీయాలలోకి ప్రవేశించి తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించుకున్నారు. శ్రీ పాలడుగు వెంకటరావుగారు కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం నుంచి పలుమార్లు శాసనసభ్యునిగా, మంత్రిగా పని చేయడం జరిగింది. ముఖ్యంగా శాసనపరిషత్ సభ్యునిగా పనిచేస్తూ మన మధ్య ఉంటూ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై, ఈరోజు వారు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమైనటువంటి విషయం. ఆయన ప్రతిపక్షానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినప్పటికి కూడా intellectual politician. ఆయన ప్రసంగాలను నేను గ్రహించాను, ఒక కమిట్‌మెంట్ జీవితం గడిపినటువంటి వ్యక్తి శ్రీ పాలడుగు వెంకటరావు. ఈ సందర్భంగా ఆయన లేకపోవడం చాలా బాధాకరమైనటువంటి విషయము. ఎన్ని కష్టనష్టాలు వచ్చినప్పటికి కూడా ఆయన నమ్ముకున్న పార్టీకి కష్టపడి పనిచేసినటువంటి నాయకుడు అని చెప్పడంలో ఎటువంటి అనుమానం లేదు. అటువంటి నైతిక విలువలు కలిగినటువంటి వ్యక్తిని కోల్పోవడం చాలా

బాధాకరం. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ వారికి మనశ్శాంతి కలగాలని మనస్పూర్తిగా కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

SRI C. RAMACHANDRAIAH(Assembly Constituency) : Sir, in this motion, the appropriate word is sorrow but, instead of sorrow the word sympathy has been used in the motion. It is only my personal view. The word 'sympathy' conveys the meaning of togetherness whereas the word 'sorrow' conveys grief. వారు నాకు చాలా సన్నిహితమైనటువంటి వ్యక్తి. నేను పార్టీలో వేరుగా ఉన్నప్పుడు కూడా ఎక్కువగా ఆయన సోషలిస్టు భావాలను గౌరవించడంవల్ల మేమిద్దరం చాలా దగ్గరయ్యాము. చాలా ఉన్నతమైన భావాలు ఉన్నటువంటి వ్యక్తి. ఈ తరంలో అతి తక్కువగా ఉన్నటువంటి రాజకీయనాయకుల్లో ఆయన ముఖ్యుడు. అవినీతిపరమైన ఆలోచనలకు ఆయన చాలా దూరంగా ఉంటారు. చివరి రోజులలో ఆయన అపోలో ఆసుపత్రిలో ఉన్నప్పుడు మనమంతా వెళ్లి ఆయనను కలవడం జరిగింది. అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆరోగ్యం పూర్తిగా క్షీణించినప్పటికీ ఆయన వ్రాసిన పుస్తకావిష్కరణ కోసం ఆయన విజయవాడకు వెళ్లడం జరిగింది. విజయవాడకు వెళ్లొద్దని నేను కూడా ఆయనకు చెప్పినప్పటికీ ఆ పుస్తకావిస్కరణకు ఆయన అంబులెన్స్‌లో వెళ్లారు. అక్కడికి వెళ్లడం వల్ల ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఈ మధ్య defections మీద ఆయన రెండు ఆర్టికల్స్‌ను వ్రాశారు. ఆంధ్రజ్యోతివంటి పత్రికల్లో కూడా ప్రచురించడం జరిగింది. దాంట్లో ఎంత మంచి భాషను వాడారంటే, ఆ భాష గురించి నేను కూడా అడిగితే, "ఇంకా నా దగ్గర పదాలు లేవు, లేకుంటే ఇంకా మంచి పదాలు వాడి ఉండేవాడినని" ఆయన సమాధానం ఇచ్చారు. It may be depression of the order of the day. ప్రతిఒక్కరు ఆయనను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చును. 1968వ సంవత్సరంలో కాంగ్రెస్‌లో చేరి మూడు సార్లు సభకు ఎన్నికై, రెండు సార్లు అసెంబ్లీకి ఎన్నికై మార్కెటింగ్, పౌర సరఫరాలశాఖమంత్రిగా, వ్యవసాయశాఖమంత్రిగా ఆయన పనిచేశారు. తను నివాసముంటున్న ఇల్లును కూడా గవర్నమెంటుకు డొనేట్ చేసినటువంటి గొప్ప వ్యక్తి. మనం ఎక్కడికి వెళ్తున్నామని నాతో ఆయన వాదించేవారు. మనం capitalist economy లోకి వెళ్లిపోతున్నామా, మరి ఇప్పటికి కూడా 60, 70 శాతం మంది ప్రజలు బీదరికంలో ఉన్నారు, వాళ్ల పరిస్థితి ఏమిటి అనేవారు. బీదరికం, రైతుల గురించి మాట్లాడే genuine concern ఉన్న వ్యక్తి ఆయన. ఈ రాష్ట్రం అటువంటి నాయకున్ని పోగొట్టుకుంది, ఇది చాలా దురదృష్టకరం, బాధాకరమైనటువంటి విషయం. తన ఆత్మకు శాంతి కలగాలని, తన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన గుర్తుగా ఏమైనా చేస్తే బాగుంటుందని ఆలోచించవలసినదిగా కోరుతూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం): శ్రీ పాలడుగు వెంకటరావుగారి అకాల మరణానికి నేను చింతిస్తున్నాను. ఆయన మంచి ఉన్నత భావాలు గల వ్యక్తి. ఆయన అందరి మధ్యలో ఉన్నప్పుడు తాను నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ ఉండేవారు. సమాజంలో ఏ విధంగా ఉండాలి అనేటువంటి విలువల గురించి చెబుతూ, రాజకీయాలకే విలువనిచ్చినటువంటి వ్యక్తి శ్రీ పాలడుగు వెంకటరావుగారు. పలు మార్లు ఎమ్.ఎల్.ఎ.గా, మంత్రిగా, ఎమ్.ఎల్.సి.గా పనిచేసి ఆ పదవికే వన్నె తెచ్చినటువంటి వ్యక్తి. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు (నామినేటెడ్): అధ్యక్షా, మీరు, నేను, పాలడుగు వెంకట రావుగారు 18 సంవత్సరాలుగా కలిసి జీవించాము. ఒక సంవత్సరము అటుఇటు మనమంతా

శాసనమండలికి రావడం జరిగింది. తను నమ్మిన సిద్ధాంతాలకోసం ఎప్పుడూ పోరాడుతూ ఉండేవాడు. మా ఇద్దరిదీ ఒకే మాట, ఒకే బాటగా ఇంతకాలం కలసి ఉన్నాము. వారూ, మేము ఎదురెదురు క్వార్టర్లలోనే ఉండేవాళ్లం. వాళ్ల అబ్బాయి, మా అబ్బాయి కూడా కలసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఎప్పుడు ఢిల్లీ వెళ్లిన కూడా మేమిద్దరం కలసి ఒకే రూంలో ఉండేవాళ్లం. తను ఏ బాధ ఉన్నా కూడా చెబుతూ వచ్చేవాడు. ఇంత సేవ చేస్తున్నప్పటికీ మనకు తగినంత గుర్తింపు రావడం లేదనేటువంటి బాధ కూడా ఆయనలో ఉండేది. స్వర్గీయ శ్రీ కాకాని వెంకటరత్నంగారి శిష్యులుగా, ఆయన చనిపోయిన తరువాత కీ.శే. శ్రీ పి.వి.నరసింహారావు సాన్నిహిత్యంలో, ఆయన మరణించిన తరువాత శ్రీ ప్రణబ్ ముఖర్జీగారికి ఆయన దగ్గరగా ఉండేవారు. మీరు, మనమందరము కలసి శ్రీ ప్రణబ్ ముఖర్జీగారి దగ్గరికి కలసివెళ్లిన సంఘటనలు చాలా ఉన్నాయి. జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేసి రైతులకు సుమారు 30వేల ఎకరాలను పంచిపెట్టడం జరిగింది. ఎప్పుడూ కూడా విలువలకు కట్టుబడే వ్యక్తి. ఆనాటి తరం, ఈనాటితరం అనే పుస్తకాన్ని రాసి విశ్లేషించడం జరిగింది. ఈనాటి స్వార్థ రాజకీయాలగురించి కూడా ఈ పుస్తకంలో వివరించడం జరిగింది. "కౌన్సిల్ వచ్చింది కానీ, రాజుగారు అక్కడ లేరు" అనే విషయాన్ని శాసన పరిషత్ వచ్చినపుడు మొట్టమొదటి సమావేశంలో ఆయన చెప్పారు. ఆయన భార్యను చూడడానికి వెళ్ళినప్పుడు కూడా ఆవిడ అదే మాటను చెపుతూ వచ్చారు. ఆయనకు గుర్తుగా ప్రభుత్వం ఏదైనా చేస్తే బాగుంటుందని నేను ఆశిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**ఉ.10.10**

శ్రీ బి. చెంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, పాలడుగు వెంకట్రావు గారి గురించి చాలా విషయాలు ఉన్నాయి. ఆయన మాటలు ఎప్పుడూ బీదల చుట్టూనే తిరుగుతూ ఉండేవి. వారు నాతో మాట్లాడిన కొన్ని విషయాలను గుర్తు చేసుకుంటూ చెప్పే ప్రయత్నం చేస్తాను. ఒకసారి ఆయన రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు నన్ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సభ్యులుగా పెడితే, నేను కొన్ని విషయాలు ఆ సమావేశంలో మాట్లాడాను. ఆ సమావేశం అయిపోయిన తరువాత ఆయన నన్ను మీకు రాడికల్ బ్యాక్‌గ్రౌండ్ ఏమైనా ఉందా అని అన్నారు. నాకు ఎదురెదురుగా అడిగే అలవాటు ఉంది కాబట్టి నేను ఆయనని మీరు మంత్రిగా రాడికల్ బ్యాక్ గ్రౌండ్ ఏమైనా ఉందా అని అడిగాను. తరువాత నేను కౌన్సిల్‌లో ఆయనను కలిసాను. దాడి వీరభద్రరావుగారు అప్పట్లో బాగా దాడిచేసేవారు. ఇప్పుడు మనం చేయడం లేదనుకోండి. ఆ సందర్భంలో వీరభద్రరావు గారిని- "మసాలా వేసుకుని, బొమ్మిడాల పులుసు తిని, పొగాకు దమ్ము కొట్టి మా మీద దాడి చేస్తున్నారా" అన్నాను. నాతో, పాలడుగు వెంకట్రావుగారు మీరు ద్వంద్వార్థాలతో వారిని కించపరుస్తున్నారని అన్నారు. అన్నందుకు వీరు ఏమీ బాధపడలేదు. అప్పుడు సభలో పల్లె రఘునాథ రెడ్డి, మసాల పద్మజ, పొగాకు యాదగిరి, బొమ్మిడి నారాయణ రావు తదితరులు అందరూ ఉండేవారు. అప్పుడు ఆయన అందరినీ దృష్టిలో పెట్టుకునే మీరు అటాక్ చేస్తున్నారు, ముందు వెళ్ళి వారికి సారీ చెప్పిరా అన్నారు . నేను వారందరినీ బాధపడుతున్నారా అని అడిగాను. ఈ విధంగా పాలడుగు వెంకట్రావుగారు అందరినీ దృష్టిలో పెట్టుకుని మనం ఎవరినీ, ఎక్కడా కించపరిచే విధంగా మాట్లాడకూడదని చెప్పేవారు. తరువాత, మరొక సందర్భంలో ఒక మాట అన్నారు. మీ బ్యాక్ గ్రౌండ్ 'బాషా' సినిమా లాంటిది కదా అన్నారు. లేదండీ నేను బాషాను కాదు, చంగల్ రాయుడిని అన్నాను. మరుసటి రోజు ఆయన నా దగ్గరకు వచ్చి, లేదు ఖచ్చితంగా నువ్వు బాషా సినిమాలో బాషాలాంటి స్టైల్‌లో ఉండేవాడివి అన్నారు. ఆయన వ్యక్తుల గురించి కూడా బాగా అధ్యయనం చేసేవారు. సభలో పెద్దలు చక్రపాణి గారు, యనమల రామకృష్ణుడు,

కంతేటి సత్యనారాయణరాజు గారు మొదలైన వారి గురించి బాగా స్టడీ చేసి మాట్లాడేవారు. ఆయన మాట్లాడే మాటలన్నీ ఎక్కువగా పేదవారి చుట్టూనే తిరుగుతూ ఉండేవి. ఆయన ఎక్కువగా సోష లిస్ట్ ఐడియాలజీతో అనుకూలంగా ఉండేట్లుగా మాట్లాడేవారు.

సభ్యులు శ్రీ చేరుపల్లి సీతారామారావు గారు కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు రాడికల్స్ ఉండేవారు అని అన్నారు. అందులో పాలడుగు వెంకట్రావుగారి పేరును మొదటగా చెప్పారు. ఆయన ఏం మాట్లాడినా, పేదవారి గురించి, వారికి సంబంధించిన చట్టాల గురించి మాట్లాడేవారు. ఆ విషయంలో టి. నాగిరెడ్డిగారు అసెంబ్లీలో ఇచ్చిన సందేశాన్ని కూడా మనం గుర్తుచేసుకోవాలని, నన్ను చదవమని అన్నారు. అంటే, ఆయన అడవిలోకి వెళ్ళమని చెప్పలేదు. ఎందుకంటే, పేదవారికి అనుకూలంగా చట్టాలు జరగడం లేదని, వారికి అనుకూలంగా ఎవరూ మాట్లాడడం లేదని, వారికి కేవలం రూ.40,000లతో ఇల్లు పూర్తవదని, కనీసం రూ.4 లక్షల రూపాయలతోనే ఇల్లు పూర్తవుతుందని అంటూ, ఇవన్నీ రికార్డులలోనే ఉంటాయని అన్నారు. ఆయన ఎప్పుడు, ఎక్కడ మాట్లాడినా పేదవారి గురించి, పుస్తకాలు వ్రాసినా పేదవారి గురించే వ్రాసే వారు. చట్టసభలలో ఇటువంటి వ్యక్తుల ప్రవేశంవల్ల కార్పొరేట్ స్టైల్ ఆఫ్ ఫంక్షనింగ్ జరుగుతోందని, పేదలకు న్యాయం జరగడం లేదని అనేవారు. ఏది ఏమైనప్పటికీ పెద్దల సభలో మాకు సలహాలు ఇచ్చే ఆయన లేకపోవడం మా దురదృష్టంగా భావిస్తున్నాం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, శ్రీ పాలడుగు వెంకట్రావు మృతి ఈ రాష్ట్రానికి తీరని లోటు. వారి ఆలోచన సామాజిక దృక్పథంలో, లౌకికత్వానికి పునాదిగా ఈ దేశం ఎదగాలని, ప్రజాస్వామ్య దేశంలో అందరూ సుఖంగా ఉండాలని, ప్రపంచ దేశాలలో భారతదేశం ప్రజాస్వామ్య పథంలో విజయం సాధించాలనే ఆలోచన కలిగిన వారు. ఆయన అనేక పుస్తకాలు వ్రాశారు. ఆయన నాయకుడిగా పేదల పక్షాన నిలబడ్డారు. ఆయన పేదల పక్షాన నిలబడి, అనేక పోరాటాలలో పాల్గొన్నారు. నేను ఆయనతోపాటు మంత్రిగా, ఎంఎల్‌సిగా కూడా ఉన్నాను. ఆయ నను చూసి నేను చాలా నేర్చుకున్నాను. పేదల పక్షాన నిలబడే వారే నాయకులు అవుతారు. అలాంటి నాయకులు శ్రీ పాలడుగు వెంకట్రావు. ఆయన మరణం ప్రజాస్వామ్యానికి తీరని లోటు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరు కుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జూపూడి ప్రభాకరరావు (నామినేటెడ్): అధ్యక్షా, మన మధ్యనే కలియ తిరుగుతూ, అవసరం అనుకున్న సందర్భంలో గంభీరంగా ఈ సభలో ఉపన్యాసాలు ఇచ్చినటువంటి పాలడుగు వెంకట్రావుగారి మరణాన్ని దగ్గరగా చూసి తట్టుకోలేకపోయాను. ఆయన కేన్సర్ మహమ్మారితో పోరాడుతూ, చనిపోతారని తెలిసీ, ఆయన తన ఆశయాన్ని పంట పొలంలో విత్తనాలు చల్లినట్లుగా చల్లాలని, అంబులెన్సులోనే విజయవాడకు వెళ్ళి తను వ్రాసిన పుస్తకాన్ని, ముఖ్యమైన స్నేహితులతో ఆవిష్కరణ జరిపే క్రమంలో ఆయన చేసిన ఉపన్యాస పాఠాన్ని నేను తీసుకున్నాను. ఆయన నన్ను వస్తున్నావా అని అడిగారు. కానీ, ఆ సమయంలో నేను అక్కడికి వెళ్ళలేకపోయాను. ఆయన పుస్తకం "నాటి త్యాగం, నేటి స్వార్థం, రేపటి... " అని వదిలేశారు. ఇవన్నీ చూసిన తరువాత ఎలా ఉండబో తోంది అనేది వ్రాశారు. నేను 2007వ సంవత్సరంలో ఈ సభకు వచ్చాను. ఈ సభలో నేను క్రొత్త వాడిని, చిన్న వాడిని. కానీ ఆయన అకస్మాత్తుగా లేచి కాంగ్రెస్‌పార్టీలో ఉంటూ, చాలా దగ్గరగా విమ

ర్శిస్తున్నటువంటి ఒక ఉపన్యాసకుడిగా పాలడుగు వెంకట్రావుగారిని చూశాను. నేను తరువాత ఆయనను మీరు కాంగ్రెస్ పార్టీవారు కదా అని అడిగితే, అవును కానీ, వీరు కాంగ్రెస్ వాళ్లు కాదు అన్నారు. ఆ తరువాత కాలక్రమంలో మా ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఒకసారి ఆయన భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తే, నేను దానిని చదివి ఆయనకు ఫోన్ చేశాను. ఈ వ్యాసం ఎవరెవరు చదువుతారో నాకు తెలుసని, నీ ఫోను వస్తుందని నేను ఊహించానని అన్నారు. అది చాలా అద్భుతమైన వ్యాసం. దేశభక్తిని, స్వతంత్ర పోరాటాన్ని అద్భుతంగా వ్రాయడమే కాకుండా, దానిని ఆయన ఉపన్యాసంలో చూపించారు.

నేను ఇటీవల జెనీవా నుంచి లండన్ వెళ్ళినప్పుడు లండన్ గ్రంథాలయంలో నాకు రెండు క్రొత్త పుస్తకాలు కనిపించాయి. One is that "Recent changes in Soviet Union and Europe" - శ్రీ గోర్బచేవ్ గారు వ్రాసిన పుస్తకం. పై పుస్తకాలకు సంబంధించి నేను ఆయనకు ఫోన్ చేస్తే తనకు కూడా ఒక కాపీ తీసుకు రమ్మని అన్నారు.

ఉ.**10.20**

So, నేను ఆయనకు ఒక పుస్తకాన్ని తీసుకువచ్చి ఇచ్చాను. Not only that but also నేను దుబాయికి వెళ్లుతున్న క్రమంలో ఒక షాపుకు షర్టు కొనుగోలు చేయడానికి వెళ్లినప్పుడు నాకు అక్కడ పాలడుగు వెంకటరావుగారు గుర్తుకు వచ్చారు. ఎందుకంటే ఆ షాపులో నెల్సన్ మండేలా వేసుకునే షర్ట్‌లు లాంటివి కొన్ని కనపడ్డాయి. పాలడుగు వెంకటరావుగారు విచిత్రమైన డ్రస్సులలో సభలోకి వచ్చేవారు. ఒక్క వేసుకునే టీ షర్టులే కాదు. తనలో ఉన్నటువంటి భావాలు అటువంటివి. సింప్లిసిటీ అనండి, లేకపోతే ఒక సోషలిస్టిక్ పాటర్న్ అనండి. అందుకే, ఆయన చనిపోయినప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఒక కమ్యూనిస్ట్ నాయకుడు చనిపోయాడని నాకు అనిపించింది. తరువాత ఆంధ్రజ్యోతిలో కూడా అదే విధంగా వ్యాసం వచ్చింది. He quoted stalwarts alike Mr. Nehru long with Mr.Lenin and Mr.Marx. మార్క్సిజమ్, లెనినిజాన్ని చాలా స్పష్టంగా, దగ్గరగా చదివినటువంటి వ్యక్తిగా ఆయన కనపడతాడు. అధ్యక్షా, నేను ఎక్కడో చదివాను. సాక్షి ఎడిటర్‌గా ఉన్న రామచంద్రమూర్తిగారు ఆయన ఇంటికి వెళ్లినప్పుడు వ్రాసిన వ్యాసంలో పాలడుగు వెంకటరావుగారి ఇంట్లో యాసర్ అరాఫత్ ఫోటో ఉందని వ్రాసారు. పాలడుగు వెంకటరావుగారి ఇంట్లో నెహ్రూ, ఇందిరాగాంధీగార్ల ఫోటోలతోపాటు మార్క్స్, లెనిన్, భగత్‌సింగ్ మరియు యాసర్ అరాఫత్ ఫోటోలున్నాయి. నన్ను అప్పుడప్పుడు కౌన్సిల్లో చూసినప్పుడు నీవు ఒకసారి నూజివీడు రాగలవా అని అడిగేవారు. పేదల కోసం దాదాపు 2 వేల ఎకరాల భూములను పంచాను. పేదలకు భూములను పంచకపోతే ఈ దేశంలో ఏ పార్టీ మిగలదు అని అనేవారు. రాష్ట్రం విడిపోయేటప్పుడు తట్టుకోలేక ఈ సభలో పాలడుగు వెంకటరావుగారు విలవిలలాడిపోయాడు. పార్టీ ఏదైనా కానివ్వండి the values, which has been shared in this House, ఆయన భావాలతో నాలాంటి వాడిని కదిలించారు. ఆదర్శంగా ఉండాలి, విలువలతో ఉండాలి, సోషలిస్టిక్ పాటర్న్‌లో ఉండాలి. ఆయన చనిపోయిన రోజు ఆయన డెడ్ బాడీ వద్ద ఆయన భార్య కనిపించారు. తరువాత, I was told ఈయన కూడా పుచ్చలపల్లి సుందరయ్య గారి లాగానే మిగిలిపోయారని. ఈ సభలో అప్పుడప్పుడు తరిమెల నాగిరెడ్డి గారిని, పుచ్చలపల్లి సుందరయ్యగారిని, ఎం.జె. మాణిక్యరావుగారిని, మాధవరావుగారి లాంటి ఎం.ఎల్.సి.లను, చట్ట సభలలో ఉద్దండులుగా ఉన్నటువంటి వారిని కోట్ చేసేవారు. నన్ను ఒకసారి your speech is

very excellent అని అన్నారు. He suggested me to straightaway go to the Library and verify the previous speeches of our Legends. He also encouraged me.

అధ్యక్షా, పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. అవి ముఖ్యం కానే కాదు. మానవ సంబంధాన్ని, రాజకీయాలలో సమసమాజ సిద్ధాంతాన్ని నెలకొల్పాలి. పదవులతోపాటు, మనం ఆ పదవిలో ఉన్నంత కాలం ఏ విధంగా ఆ పదవికి వన్నె తెచ్చామనేదే ముఖ్యం. ఆయన 11, నవంబరు 1940 వ తేదీన జన్మించినా, ఆ కాలంలోనే ఎం.ఏ చేసినా, తరువాత నాలుగైదు ప్రభుత్వ శాఖలకు మంత్రిగా చేసినా, ఎం.ఎల్.ఏ గా ఉన్నా, ఎం.ఎల్.సిగా ఉన్నా చివరి దాకా విలువల కోసం పరితపించే వారు. గుడిసెల వెంకటస్వామిగారు చనిపోయినప్పుడు ఆరోజు అక్కడకు పాలడుగు వెంకటరావు గారు శరీరానికి ఒక బెల్టు కట్టుకొని, పైన ఒక టవల్ వేసుకొని రావడం చూసిన నాకు చాలా బాధ వేసింది. అప్పటికే పాలడుగు వెంకటరావుగారు కూడా బెడ్ మీద చావుకు దగ్గరగా ఉండి, ఆ బెడ్ మీద నుండి గుడిసెల వెంకటస్వామి గారిని చూడటానికి వచ్చారు. వెంకటస్వామి గారి ఇంటికి వచ్చినప్పుడు ఏమిటి సార్, బాగుండకపోతే ఇలా వచ్చారేమిటి అని అడిగినప్పుడు let me complete my responsibility అని అన్నారు. పేదల కోసం పనిచేసి, శ్రమించిన నా సహచరులు గుడిసెల వెంకటస్వామిగారు చనిపోతే నేను బెడ్ మీద ఉండలేను, గుడిసెల వెంకటస్వామిని చూడకుండా వెంకటరావు పోలేడు కదా ప్రభాకర్ అని అన్నాడు. అంటే, తన చివరి దశలో అంత రిస్క్ తీసుకొని వచ్చిన వ్యక్తి ఈరోజు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరం. ఆయన కుటుంబానికి తీరని లోటు. ఈ నిండు సభలో దాదాపు 8 సంవత్సరాలపాటు ఆయనను చూసిన వ్యక్తిగా మాట్లాడుతున్నాను. రాజకీయాలంటే విలువలు ఉండాలి, రాజకీయాలంటే క్యారక్టర్ కావాలి, రాజకీయాలంటే సమాజాన్ని బ్రతికించాలి కాని, సమాజాన్ని చంపకూడదు. పార్టీ ఏదైనా కాని, ఆ పార్టీ తప్పు చేస్తుంటే మనం దానిని ఖచ్చితంగా సరైన పద్ధతిలో పెట్టాలని చెప్పేవారు.

అధ్యక్షా, ఆర్.కె.వంటి విప్లవకారులు ప్రభుత్వంతో సంధి చేసుకునే సమయంలో వేసిన కమిటీలో ఆరోజు పాలడుగు వెంకటరావుగారు ఒక మెంబర్‌గా ఉన్నారు. విప్లవ సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్నటువంటి పచ్చి కాంగ్రెస్‌వాది పాలడుగు వెంకటరావుగారు. తుది శ్వాస వరకు విలువల కోసం బ్రతికినటువంటి ఒక గొప్ప నాయకుడు. మన సహచరుడుగా, మన మిత్రుడుగా ఉన్న వారు ఈరోజు మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆయన ఆశయాలు కొనసాగాలని కోరుకుంటూ, నాకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

శ్రీమతి బలశాలి ఇందిర (నామినేటెడ్): అధ్యక్షా, పాలడుగు వెంకటరావుగారు లాంటి ఒక ఉత్తమమైన లెజిస్లేటర్ గురించి మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈరోజున వారు మన మధ్యన లేకపోవడం చాలా విచారకరమైన విషయం. ఒక సీనియర్ లెజిస్లేటర్‌గా ఆయన ఈ సభలో అందరికీ ఆదర్శంగా నిలుస్తూ, ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఆయా ప్రభుత్వాలకు కూడా సలహాలనిస్తూ, ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవాలి, ఎలా వాటిని పది మందికి ఉపయోగపడేలా వినియోగించాలి అనే దాని గురించి ప్రభుత్వాలకు సలహాలనిస్తుండే వారు. మా అందరికి కూడా ఒక ఉత్తమమైన లెజిస్లేటర్‌గా ఉండాలంటే.. నీతినిజాయితీగా ఉండే వ్యక్తికి ప్రాధాన్యత ఎలా ఉంటుందనే దానికి ఒక నిలువుటద్దంగా వారు ఉండేవారు. నేను ఎం.ఎల్.సిగా అయిన తరువాత మాత్రమే వారితో నాకు పరిచయమైంది. నేను పలకరించినప్పుడు చాలా చక్కగా నన్ను ఆశ్వీరదిస్తూ మాట్లాడేవారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు మీద మాట్లాడవలసివచ్చినప్పుడు నేను సభలో మాట్లాడిన తీరుకు నన్ను

మెచ్చుకుంటూ, చాలా చక్కగా మాట్లాడవమ్మా అంటూ అభినందించారు. నిజంగా, అంత సీనియర్ మోస్ట్ పర్సన్ ఇందిరాగాంధీ దగ్గర నుంచి పి.వి. నరసింహారావుగారి వరకు అంత పెద్ద, పెద్ద వ్యక్తులతో మెలిగినటువంటి ఒక వ్యక్తి నన్ను అప్రిషియేట్ చేయడమంటే, అది చాలా గొప్ప అదృష్టంగా నేను భావించాను. అలాంటి వ్యక్తులు ఇంకా మనకు కావాలి. ఆయనలో ఉన్నటువంటి ఆ సోషలిస్టిక్ భావాలను మనందరం కూడా అభివృద్ధి చేసుకోవాలి. రాజకీయమంటే పదవులు పొందడం, సంపాదించుకోవడం కాదు. పది మందికి ఉపయోగపడేలా మెలిగినప్పుడే ఆ వ్యక్తికి, అతను చేసినటువంటి పదవికి సార్ధకత ఉంటుందనే దానికి ఒక నిలువెత్తు నిదర్శనంగా మనందరం భావించి, అటువంటి వ్యక్తిని మనందరం ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. వారియొక్క మరణానికి నా ప్రగాఢమైన సంతాపాన్ని తెలియచేస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసనభ నియోజకవర్గం)ః అధ్యక్షా, స్వర్గీయ పాలడుగు వెంకట రావుగారి ఆకస్మిక మరణం మనందరిని శోక సముద్రంలో ముంచి వేసింది. పాలడుగు వెంకట రావుగారితో నా అనుబంధం మూడు దశాబ్దాలు. ఈ 30 సంవత్సరాలలో ఇటు పార్టీలోకాని, ప్రభుత్వంలోకాని, ఎం.ఎల్.సిగా ఎంపికైన తరువాత అనేక పర్యాయాలు, అనేక విషయాల మీద ఆయనతో మేము చర్చించినప్పుడు ఆయనకున్నటువంటి మేధస్సు, ఆయనకున్నటువంటి ఆలోచనా సరళి తెలిసేవి. సమసమాజ స్థాపనే నా జీవిత ధ్యేయమని చెప్పి ఆయన ప్రత్యేకంగా వ్రాసుకున్న వ్యక్తి. ఎప్పుడూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పరితపించినటువంటి వ్యక్తి ఆయన. వాళ్ల యొక్క శ్రేయస్సు కోసం అహర్నిశలు, అహరహం కృషి చేసినటువంటి వ్యక్తి పాలడుగు వెంకటరావుగారు. అనేక సందర్భాలలో ఆయన మాట్లాడే విధానాన్ని మన సభలోనే చూశాం. అధికారంలో ఉండి కూడా అధికారంలో ఉన్నటువంటి అనేకమైన రుగ్మతలను, అనేక రకాలైన తప్పులను ఖచ్చితంగా, సూటిగా, నిర్మొహమాటంగా చెప్పినటువంటి అతి తక్కువ మంది వ్యక్తులలో ఆయన ఒకరని తెలియజేస్తున్నాను.

ఉ.**10.30**

వారు అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. ఆయన చరిత్రను చూస్తే, చిన్న వయస్సులోనే ఆంధ్రా యూనివర్సిటీలో ఒక విద్యార్థి నాయకుడిగా జీవితాన్ని ప్రారంభించారు. 1972లో శాసన మండలి సభ్యుడిగా చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి ప్రవేశించడం జరిగింది. 1975లో శాసన సభ్యుడిగా ఎంపికై, మంత్రిగా కూడా పనిచేశారు. అదేవిధంగా, 1989లో మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభకు రావడం జరిగింది. రెండు పర్యాయాలు శాసనసభకు, మూడు పర్యాయాలు శాసనమండలికి వారు ప్రాతినిధ్యం వహించారు.

ముఖ్యంగా కృష్ణాజిల్లాలో నూజివీడు వాసిగా అక్కడి పేదలకు జరుగుతున్న అన్యాయాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అక్కడి జమీందారుల ఓర్వలేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అక్కడున్న బీదవారికి భూములు పంచాలనే సహృదయంతో, ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమైనవని తెలియజేస్తున్నాను. వారు రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. యువజన కాంగ్రెస్ విభాగంలోనూ పనిచేశారు. గత ముప్పై ఏళ్లలో నేను చూసినంత వరకు వారు అధికారంలో ఉన్నప్పుడు గానీ, అధికారంలో లేనప్పుడుగానీ ఒకే పార్టీలో పనిచేయడం జరిగింది.

అలాగే, రాజకీయ శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో కూడా వారిది అందెవేసిన చేయి. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్యన లేకపోవడం చాలా దురదృష్టకరం.

ఇకపోతే, ఆయన చక్కని రచయిత. సమకాలీన రాజకీయాల గురించి అనేకమైనటువంటి పుస్తకాలు వ్రాసి, రాజకీయ వ్యవహారాలపై ఖచ్చితంగా, నిష్కల్మషంగా తన అభిప్రాయాలను వెలిబుచ్చిన అనేక సందర్భాలను మనం చూశాము. వారికి మన రాష్ట్ర నాయకులతోనే కాదు, జాతీయ స్థాయి నాయకులతో కూడా చక్కని సంబంధాలు ఉన్నాయి. నాటి ప్రధాని శ్రీ పి.వి. నర్సింహారావుగారు మొదలుకుని, నేటి రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ కుమార్ ముఖర్జీగారి వరకు గొప్ప, గొప్ప వ్యక్తులతో సత్సంబంధాలు నెలకొల్పి, జాతీయ దృక్పథంతో జీవితమంతా పూర్తిగా రాజకీయాలకే అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి ఆయన. మా సహచరుడిగా ఇక్కడ ఎనిమిదేళ్లు కలిసి ఉండి, మేం అత్యంత దగ్గరగా చూసిన వ్యక్తి వారు. ఆయన సద్గుణాల సమాహారం. అలాంటి శ్రీ పాలడుగు వెంకట్రావుగారు నీతికి, నిజాయితీకి నిలువుటద్దమని అందరూ ఘోషించారు. నూటికి నూరు పాళ్లు ఖచ్చితంగా అది వాస్తవం, యథార్థం, సత్యం. ఇటువంటి పరిస్థితుల్లో, శోకతప్త హృదయులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

డా. బచ్చల పుల్లయ్య (ఉపాధ్యాయ నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు): అధ్యక్షా, సభ్యులు శ్రీ పాలడుగు వెంకట్రావుగారి మృతికి సంతాపాన్ని తెలిపే కార్యక్రమంలో ఇలా పాల్గొనవలసి వస్తుందని నేను ఎన్నడూ ఊహించలేదు. నేను ఎమ్మెల్సీ అయిన తరువాతనే మాకున్నటువంటి బంధంగానీ, అనుబంధంగానీ బలపడుతూ వచ్చింది. అయితే, ఆయన పేరును గానీ, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవల్ని గానీ అప్పుడప్పుడూ మేం వింటూ వచ్చామే గానీ, ఇక్కడికి వచ్చాకే ఆయనతో అనుబంధం బాగా పెరిగిందని చెప్పొచ్చు. ఆయన మరో రెండు గంటల్లో చనిపోతారనగా, మేము హైదరాబాదు నుండి కడపకు బయలుదేరి వెళ్లడం జరిగింది. శ్రీ పాలడుగు వెంకట్రావు గారు చనిపోయారనే వార్త మేం కార్లో ఉండగానే మార్గమధ్యంలోనే మాకు తెలియడం చాలా బాధ కలిగించింది.

అధ్యక్షా, ఆయనతో కలిసి ఉన్న సమయంలో ఎదురైన రెండు, మూడు వ్యక్తిగత సన్నివేశాలను నేను మీతో చెప్పదల్చుకున్నాను. ఆయనతో రెండు, మూడుసార్లు వ్యక్తిగతంగా కలిసిన ప్రతి సమయంలోనూ పది, పదిహేను నిమిషాలు మేమిరువురం మాట్లాడుకోవడం జరిగేది. అలా వారిని కలిసిన సమయంలో వారికున్నటువంటి అభిప్రాయాల్ని గమనించినట్లయితే, దాదాపుగా ఎవరికైనా అధికారం ఉంటే, దాని వెన్నంటే అహంకారం కూడా వస్తుంది. అయితే, నేను వారిలో గమనించిందేమంటే, ఆయన ఇన్ని పదవులు అనుభవించినా కూడా ఏ మాత్రం అహంకారం లేకుండా, ఆయన వద్దకు వచ్చినటువంటి వ్యక్తులను సాదరంగా ఆహ్వానించి, కూర్చోబెట్టి మంచి, చెడూ అన్నీ మాట్లాడి పంపేవారనేది వ్యక్తిగతంగా నాకున్న అభిప్రాయం.

ఒక రోజున నేను వారిని కలిసినప్పుడు మా మాటల్లో ఒక విషయం చర్చకు వచ్చింది. పుల్లయ్య గారూ, మీరు లెక్చరర్‌గానూ, ప్రిన్సిపాల్‌గానూ చాలా కాలం పనిచేశారంట కదా, మరి మీకు ఉద్యోగ జీవితం బాగుందా, ఇప్పుడు ఎమ్మెల్సీగా పనిచేయడం బాగుందా, మీ అభిప్రాయమేమిటి అని అడిగి తెలుసుకుని మరీ మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి వారు. వారు సభలో

ఉన్న సమయాన్ని ఒకసారి గుర్తు చేసుకుంటే, వారి పార్టీ ఏదైనా కావొచ్చు, ఆ రోజున జరిగిన సన్నివేశాన్నిబట్టి, వారికున్నటువంటి అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా లేచి నిలబడి ఖచ్చితంగా చెప్పాలనుకున్న మాట చెప్పే వ్యక్తి ఆయన. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్యన లేకపోవడం నిజంగా బాధాకరం. చాలా సీనియర్ రాజకీయవేత్త, అనుభవమున్నటువంటి వ్యక్తి ఈ సభలో లేకపోవడం నిజంగా బాధాకరం. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఆత్మ స్థైర్యాన్ని కలుగజేయాలని, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీ అంగర రామమోహన్ (స్థానిక సంస్థలు, పశ్చిమ గోదావరి): అధ్యక్షా, సీనియర్ శాసన మండలి సభ్యులు మరియు ఎమ్మెల్యేగా పనిచేసిన శ్రీ పాలడుగు వెంకట్రావుగారి మరణం మనకందరికీ చాలా తీవ్రమైన లోటు. వారు కాంగ్రెస్ సభ్యుడిగా మాత్రమే కాకుండా, ఒక సీనియర్ సభ్యుడిగా చట్టసభల్లో ఆయన చేసిన ప్రసంగాలు అందర్నీ ఆకట్టుకునే విధంగా ఉండేవి. ఆయన కృష్ణా జిల్లాలో స్థానికసంస్థలనుండి తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్‌గా అనేక పదవులు చేపట్టి, ఇవాళ చట్టసభల్లో ఎక్కువ కాలం పనిచేసిన వ్యక్తిగా, ప్రజలందరి మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపబడ్డారు. ఆ విధంగా అన్ని రకాల పదవులను చేపట్టిన వ్యక్తి అనే భావన మనకందరికీ కలుగుతుంది.

ఆయన చరిత్రను ఒకసారి చూసినట్లయితే – ఆయన రైతు ఉద్యమంలో పాల్గొనడం గానీ, పేదవారికి భూములు పంపిణీ చేయడంలో గానీ కీలకపాత్ర వహించిన విధానం చాలా గొప్పది. ఆయన అప్పుడప్పుడు శాసనమండలిలో మాట్లాడేటప్పుడు, ప్రస్తుత విద్యావ్యవస్థ మీద తీవ్రమైన ఆవేదన చెందేవారు. విద్యను కొనుక్కునే పరిస్థితి ఉన్నదని, విద్య మీద జరిగిన ప్రతి చర్చలోనూ తీవ్రంగా మధనపడేవారు. మరీ ముఖ్యంగా, రాష్ట్రం విడిపోయిన సందర్భంగా జరిగిన చర్చల్లో కూడా ఆయన తీవ్రమైన ఆవేదన చెందిన వ్యక్తిగా ఈ సభలో మాట్లాడటం జరిగింది. అనేక సందర్భాల్లో అలాంటి సీనియర్ సభ్యుడు మాట్లాడిన విషయాల్ని మాలాంటి వాళ్లం అబ్జర్వ్ చేసే వాళ్లం. ప్రధానంగా ఆయన నిరాడంబరంగా ఉండటం కూడా చాలా గొప్ప విషయం. ఏదేమైనా శాసన మండలి సభ్యుడిగా ఆయన మరణం మనకందరికీ తీరని లోటుగా భావిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, కృష్ణా జిల్లాలోనూ, అదే విధంగా రాష్ట్ర రాజకీయాల్లోనూ నాలుగు దశాబ్దాలకు పైగా తమకంటూ ప్రత్యేకమైన ముద్రను వేసుకున్న వ్యక్తి స్వర్గీయ శ్రీ పాలడుగు వెంకట్రావుగారు. రెండు దశాబ్దాలకు పైగా మా సోదరులు స్వర్గీయ దేవినేని వెంకట రమణగారికి గానీ, నాకుగానీ వారితో సన్నిహిత వ్యక్తిగత సంబంధాలున్నాయి. పార్టీలు వేరైనప్పటికీ కూడా నిర్మొహమాటంగా సభలో చర్చించడంలోగానీ, అదేవిధంగా అధికార పక్షమా, ప్రతిపక్షమా అన్నది కూడా చూడకుండా సమస్యల పట్ల ఆయన స్పందించే తీరును మనమందరం ఆదర్శంగా తీసుకోవాలి. గత దశాబ్ద కాలంగా ప్రతిపక్షంలో ఉండి మేము ఒకపక్క పోరాటం చేస్తుంటే, అధికార పక్షంలో ఉండి కూడా ఆయన నిర్మొహమాటంగా ప్రభుత్వాన్ని నిలదీసేవారు. నూజివీడు ప్రాంతంలో భూ పోరాటాల్లో అటవీ భూములు, దేవాలయ భూములు కాపాడి, భూమిలేని పేదవాళ్లకు భూములిప్పించడంలో ఆయన పాత్ర మనమెవ్వరూ మర్చిపోకూడదు.

విద్యార్థి దశలో రాజకీయాల్ని సంఘాన్ని ప్రోత్సహించడంలో గానీ, యువకులు ప్రత్యేకంగా రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించడంలోగానీ వారి పాత్ర విశిష్టమైనది.

కృష్ణా జిల్లా రాజకీయాలను గమనిస్తే, ఒక మెట్ట ప్రాంతం నుండి, వెనుకబడ్డ ప్రాంతం నుండి వచ్చి, విద్యార్థి నాయకుడిగా ఎదిగి, నిజాయితీగా రాజకీయాల్లో కొనసాగి, తనకంటూ గానీ, తన కుటుంబానికంటూ గానీ సంపాదించుకోవాలన్న ఆలోచన ఏ మాత్రం లేకుండా నిస్వార్థంగా రాజకీయాలు నెరిపిన వ్యక్తి ఆయన. ఎందుకంటే, ఈ రోజుకి కూడా మా జిల్లాలో నిజాయితీగా రాజకీయాల్లో పనిచేసిన వ్యక్తి ఎవరని ఏ పార్టీ వారిని అడిగినా కూడా, అందరూ స్వర్గీయ శ్రీ పాలడుగు వెంకట్రావుగారేనని నిర్మొహమాటంగా చెబుతారు. తప్పకుండా మనమంతా అటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాబట్టి, గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి, సర్గీయ శ్రీ పాలడుగు వెంకట్రావుగారిని ప్రజలందరూ గుర్తుపెట్టుకునే విధంగా, నూజివీడు ప్రాంతంలో ఏదైనా ఒక కార్యక్రమం జరిపించే విధంగా ముందుకు వెళతామని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

ఉ.**10.40**

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, శ్రీ పాలడుగు వెంకట్రావుగారితో ఉద్యమ రీత్యా కమ్యూనిస్ట్ పార్టీకి మొట్టమొదటినుండి సత్సంబంధాలు ఉండేవి. వారు ఆసుపత్రిలో ఉన్నప్పుడు నేను, మా నూజివీడు ప్రాంత కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు రెండు, మూడు రోజులకు ఒకసారి వెళ్లి పరామర్శించేవాళ్లము. వారు మరణించిన రోజున మా పార్టీ జాతీయ సమావేశాలు నాగపూర్‌లో జరుగుతున్న కారణంగా మేము ఎవరం అక్కడ లేకపోయినప్పటికీ సమాచారం వచ్చిన వెంటనే కృష్ణా జిల్లా పార్టీ నాయకులు, అలాగే డా. నారాయణ గారు వెంటనే ఇక్కడకు వచ్చి వారి అంత్యక్రియలలో పాలుపంచుకోవడాన్ని మా ఉద్యమ నివాళిగా భావించడం జరిగింది. గతంలో కూడా అనేక సమస్యలమీద వారి అభిప్రాయాలను తీసుకోవడం జరిగింది. అనేక ప్రజా సమస్యలపై ఫోన్ చేసి వారు ఎవరినైనా పిలిపించుకోవడం గానీ, లేదా మా కార్యాలయానికి వచ్చి అభిప్రాయాలను తీసుకోవడమనేది నిరంతర ప్రక్రియగా జరుగుతుండేది. విద్య, వైద్యాలను వ్యాపారమయం చేసిన తరువాత సమాజంలో ప్రజాస్వామిక విలువల మీద దాని ప్రభావం ఏ విధంగా ఉంటుందనే అంశాన్ని ఇతర దేశాలలో ఉన్న అనుభవాలను మన దేశ పరిస్థితులకు అన్వయింపచేసే విధంగా ఎవరైనా థీసిస్ చేస్తే వారితో అసోసియేట్ కావాలని వారు అనుకునేవారు. ఎవరైనా విద్యార్థులు ఇటువంటి ప్రాజెక్టు చేస్తే తమవంతు సహాయం అందచేస్తామని కూడా వారు తెలిపేవారు. అనేక విషయాల మీద చాలా విచారకరమైన పద్ధతులలోనే వారి జీవనం గడిపేవారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలకు ఆయన తీవ్ర అసంతృప్తికి, విచారానికి, నిర్వేదానికి గురైనట్లుగా మాట్లాడేవారు. అయినా, చివరివరకూ మనవంతు కర్తవ్యం మనం నిర్వహించవలసిందేనని, జీవితంతో మనం పోరాడవలసిందేనని అందరికీ సలహాలు చెప్పేవారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, సెక్యులరిజానికి, సోషలిజానికి తీవ్రమైన ప్రమాదాలు వస్తున్న పరిస్థితులలో ప్రజాస్వామిక శక్తులతో కలిసి కమ్యూనిస్ట్ నాయకులు మరోసారి ఈ విషయాలను పరిశీలించనట్లయితే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని గాఢంగా నమ్మి అందుకొరకు తమవంతు ప్రయత్నం చేసిన వ్యక్తి శ్రీ పాలడుగు వెంకట్రావుగారు. మన మధ్య వారు లేకపోవడమనేది ప్రజాస్వామిక ఉద్యమానికి తీవ్రమైన లోటుగా భారత కమ్యూనిస్ట్ పార్టీ భావిస్తున్నది. అలాగే, వారికి

ఉన్న ఆస్తిని కూడా ఉద్యమానికి, ప్రజాభివృద్ధికి కేటాయించారు. నూజివీడులో వారు చేసిన పోరాటాలు మనం మరచిపోకూడదు. అలాగే, వారు పంచిన భూములకు సంబంధించి ఇంకా పట్టాలు రాలేదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మేము నెల రోజుల క్రితమే కృష్ణా జిల్లా కలెక్టరు గారిని కలిసి పరిస్థితిని వివరించడం జరిగింది. అటవీ, రెవెన్యూ భూములు ఆక్రమణలో ఉండి, పట్టాలు లేని పరిస్థితులలో నూతన రాజధాని కూడా వస్తున్న సందర్భంలో అక్కడ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నూజివీడు ప్రాంత కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు కొంతమంది శ్రీ పాలడుగు వెంకట్రావుగారితో కలిసి ప్రయత్నం చేసినా అది మధ్యలోనే ఆగిపోయింది. వారి ఆశయాలను సాధించే దిశగా, వారి ఆశయాలను కొనసాగించే క్రమంలో వారు కోరుకున్న అంశాలను పరిష్కరించడం ద్వారా వారికి సరైన నివాళిని అర్పించగలుగుతామని నా అభిప్రాయం. ఈ సందర్భంలో నేను గానీ, మా పార్టీగాని వారి ఆశయాల కోసం కృషి చేస్తామని మనవి చేస్తున్నాను. వారికి పరలోకం మీద నమ్మకం లేదు, స్వర్గం మీద అసలే నమ్మకం లేదు. ఒక జీవి పుట్టి మరణించే లోపల ఏ విధంగా వ్యవహరించాలనేదానిపై తార్కికంగా ఆలోచించే శ్రీ పాలడుగు వెంకట్రావుగారికి నా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

శ్రీ వెంకట సతీష్ కుమార్‌రెడ్డి సింగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం)ః ఈ సంవత్సరం జనవరి 19 వ తేదీన గొప్ప నాయకుడు, మన సహచరుడు శ్రీ పాలడుగు వెంకట్రావు గారు చనిపోయారని తెలిసినప్పుడు నేను దిగ్భ్రాంతికి లోనయ్యాను. వారితో నాకు పెద్దగా పరిచయం లేకపోయినా నాలుగు సంవత్సరాల పాటు వారున్న సభలో నేను కూడా సభ్యునిగా ఉండడం, ముఖ్యంగా సీటింగ్ అరేంజ్‌మెంట్ చేసినప్పుడు వారికి దగ్గరగా నేను కూర్చోవడం జరిగింది. సభలో చర్చలు జరుగుతున్నప్పుడు వారి భావాలను వ్యక్తపరిచినప్పుడు చాలా ఆదర్శవంతమైనవిగా ఉండేవి. బీదలపట్ల, భూమి లేని వారి పట్ల ఈ సమాజంలో డిప్రైవ్డ్ సెక్షన్స్‌పట్ల చాలా కన్సర్న్ ఉండే వ్యకి ఆయన. ఆయన అధికార పార్టీ సభ్యులైనప్పటికీ చాలా సందర్భాలలో అధికారపార్టీని విమర్శిస్తూ చేసిన ప్రసంగాలు అనేకం ఉన్నాయి. ఎప్పుడూ అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడాలి, అధికార పార్టీ చెప్పిన దానిని వెనకేసుకురావాలని అనుకోకుండా ఆయనకున్న భావాలను నిస్సందేహంగా వ్యక్తపరచేవారు. వారి ప్రసంగాలలో పేదరికం, సమాజంపట్ల ఆయనకున్న ముందుచూపు కనిపిస్తుంది. అలాగని ఆయనని పార్టీకి విధేయుడు కారు అని అనలేము, ఎందుకంటే ఆయన పార్టీకి వీర విధేయులు. ఈ సభలో సమైక్యాంధ్రా పోరాటం జరుగుతున్నప్పుడు ఆయన అన్న మాటలు నాకు ఇంకా గుర్తున్నాయి – "నా జీవితంలో ఎప్పుడూ కూడా నా పార్టీకి వ్యతిరేకంగా నేను నడుచుకోలేదు. నా పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. కానీ, ఈ రోజు ఈరకంగా ఈ రాష్ట్రాన్ని విభజించడాన్ని మాత్రం నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానంటే నా మనసులో ఎంత అలజడి ఉన్నదో" అని ఆయన అన్నారు. ఈ మాటలు విన్నప్పుడు రాష్ట్ర విభజన సందర్భంలో ఆయన ఎంత బాధ అనుభవించారో మనకు అర్థమవుతుంది. వారికి, మాకు బయట ఇష్టాగోష్టి చర్చలలో అంతగా సంబంధం లేకపోయినా కూడా సభలో ఆయన వ్యవహరించిన తీరు మరచిపోలేనిది. మూడు పర్యాయాలు ఎమ్‌ఎల్‌సిగా ఉండడం, రెండు పర్యాయాలు శాసనసభ్యునిగా, రెండు పర్యాయాలు మంత్రిగా ఉండడం ముదావహం. వారు స్నేహశీలి. అందరితో ఎంతో ఆత్మీయంగా, గౌరవంగా మాట్లాడేవారు. అటువంటి వ్యక్తి ఈ రోజు ఈ సభలో లేకపోవడం చాలా బాధను కలిగిస్తోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

ఉ.**10.50**

మిస్టర్ ఛైర్మన్: ఇప్పుడు సంతాప తీర్మానం.

## సంతాప తీర్మానం

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనపరిషత్ సభ్యులు శ్రీ పాలడుగు వెంకట్రావుగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

శ్రీ పాలడుగు వెంకట్రావుగారు తేది. 11.11.1940 న కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. శ్రీ పాలడుగు వెంకట్రావుగారు 1968వ సంవత్సరంలో యువజన కాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1972-78 సంవత్సరాల మధ్య ఆయన శాసనపరిషత్ సభ్యుడిగా వ్యవహరించారు. 1978వ సంవత్సరంలో ఆయన నూజివీడు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. తిరిగి 1989వ సంవత్సరంలో అదే నియోజకవర్గం నుంచి ఆయన విజయం సాధించారు. 1980-82 సంవత్సరాల మధ్య గ్రామీణ త్రాగునీటి సరఫరా శాఖమంత్రిగా, 1982-83 సంవత్సరాల మధ్య వ్యవసాయశాఖమంత్రిగా, 1989-92 సంవత్సరాల మధ్య మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖమంత్రిగా ఆయన సేవలందించారు. 2007వ సంవత్సరంలో శాసనపరిషత్ పునరుద్ధరణ తర్వాత 2007-2011 సంవత్సరాల మధ్య శాసనపరిషత్ సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారు. తిరిగి 2011వ సంవత్సరంలో ఆయన శాసనపరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

ఆదర్శ భావాలతో భూ ఆక్రమణలపై నిరంతరం ఆయన పోరాడారు. నూజివీడులో రైతు సేవా కేంద్రం ప్రారంభానికి తన నివాసాన్ని ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వ విద్యాలయానికి విరాళంగా ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ తరానికి దేశంకోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల గురించి తెలియచెప్పాలని వీర భారత్ పేరుతో ప్రత్యేకమైన ఆల్బమ్‌ను తీసుకువచ్చేందుకు మూడేళ్లుగా తపించారు.

శ్రీ పాలడుగు వెంకట్రావుగారు అందరూ చెప్పినట్లుగా అభ్యుదయవాది. భూపోరాటాలు మరియు ఎన్నో ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ఉద్యమం లేదా ఏ పోరాటంగానీ ముందుకు వెళ్లదని ఆయన భావించేవారు. "Ours is a Secular, Democratic, Socialist pattern of Society" అని మన రాజ్యాంగంలో మనం వ్రాసుకున్నామని ఆయన చెప్పేవారు. దానికోసం వట్టిగా ఇంట్లో కూర్చోకుండా ఈ విధంగా చేయాలని ఆయన ఇటువంటి కార్యక్రమాలను చేపట్టారు. అందరూ చేయాలని అనుకున్నా, ప్రాక్టీసు విషయంలో చాలా తక్కువగా చేస్తాము. "సంతోషమైన సంసారం, త్యాగంతో కూడిన బ్రతుకు తెగలిగిన సమాజం, దేశభక్తి కలిగినటువంటి దేశం" మనకు అవసరమని మనం అనుకుంటాము. ఆ దిశగా తన జీవితాంతం ఆయన ప్రయాణించారు. వారి అంతిమ యాత్రలో కూడా మనలో చాలామంది పాల్గొనడం జరిగింది.

శ్రీ పాలడుగు వెంకట్రావుగారు తేది. 19.01.2015 న మరణించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కొంతసేపు మనం మౌనం పాటిద్దాము.

(కీర్తిశేషులు శ్రీ పాలడుగు వెంకట్రావుగారి ఆత్మకు శాంతి చేకూరాలని కొంతసేపు సభ మౌనం పాటించింది.)

MR. CHAIRMAN: Now, the House is adjourned to meet again at 10.00 a.m. tomorrow.

(Then, the House adjourned at 10.53 a.m. to meet again on 10.03.2015 at 10.00 a.m.)

* * *